క్లుప్తంగా

డీఎస్పీకి సన్మానం



సన్మానిస్తున్న దళితసంఘాల నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ కొత్త డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన జీవన్‌రెడ్డిని దళిత, బౌద్ధ సంఘాల నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. డీఎస్పీ కార్యాలయంలో కలిసి శాలువతో సత్కరించారు. పుష్ప గుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. భారతీయ బౌద్ధమహా సభ ఉత్తర తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నజాడే ప్రజ్ఞా కుమార్, బాబూ జగ్జీవన్‌రాం అభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లెల స్వామి, భారతీయ బౌద్ధమహాసభ జిల్లా అధ్యక్షులు విట్టల్ బుక్లే, మాజీ జిల్లా అధ్యక్షులు దయానంద్ కాంబ్లే, హరీశ్, కార్తీక్ తదితరులు ఉన్నారు.

అస్సాం సీఎంతో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి



సీఎంతో లోక ప్రవీణ్‌రెడ్డి

ఆదిలాబాద్: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లా బాసరలో విజయ సంకల్ప రథయాత్రను మంగళవారం ప్రారంభించింది. భైంసాలో నిర్వహించిన బహిరంగ సభలో అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన్ను జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి లోక ప్రవీణ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఫేర్‌వెల్ హంగామా



నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఉట్నూర్‌రూరల్: విద్యార్థులు ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని ఉట్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పావని కుమారి అన్నారు. మంగళవారం కళాశాలలో ఫేర్‌వెల్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. అధ్యాపకులు కేశవులు, శ్రీనివాసరావు, సువర్ణ, శ్రీలత, గణేశ్, వినోద్, లక్ష్మణ తిరుమల, సుజాత, నవీన్, దశరథ్, కిశోర్, రూప పాల్గొన్నారు.

ఘనంగా క్రీడా, సాంస్కృతిక వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

బేల: మండల కేంద్రంలోని గోవర్ధన్ గార్డెన్‌లో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో క్రీడా, సాంస్కృతిక వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఆటలు, సాంస్కృతిక పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి రవీందర్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ప్రిన్సిపాల్ సూర్యప్రకాశ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు



అధికారులను సన్మానిస్తున్న ఎంపీపీ తదితరులు

ఉట్నూర్‌రూరల్: ప్రభుత్వ ఉద్యోగులు ఉత్తమ సేవలు అందించినప్పుడే గుర్తింపు లభిస్తుందని ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు అన్నారు. ఎంపీడీవో తిరుమల, ఎంపీవో మహేశ్ బదిలీపై వెళ్తున్న సందర్భంగా స్థానిక ఫంక్షన్ హాల్‌లో మంగళవారం వారిని సన్మానించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఉద్యోగులకు బదిలీలు సహజమన్నారు. అదేవిధంగా ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో మురళీధర్‌శర్మ, ఎంపీవోగా లింగయ్యను సన్మానించారు. వైస్ ఎంపీపీ బాలాజీ, కోఆప్షన్ సభ్యుడు రషీద్, ఈజీఎస్ ఏపీవో రజినీకాంత్, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

‘ఉపాధి’తో ఊతం..

- అంతర్గత రోడ్లకు మహర్దశ
- నేరడిగొండ మండలానికి రూ.3.21 కోట్లు
- మార్చి 31లోగా పనులు పూర్తి చేయాల్సిందే
- పనుల్లో నాణ్యత పాటించేనా..?



దర్బతండాలో సీసీ రోడ్డు పనులు చేపడుతున్న దృశ్యం

నేరడిగొండ: రహదారులు బాగుంటేనే ప్రయాణానికి ఎలాంటి ఇబ్బందులు ఉండవు.. ప్రధాన రోడ్లకు ఎప్పటికప్పుడు మరమ్మతు చేస్తుంటారు. మరీ గ్రామాల్లో ఉండే అంతర్గత రహదారుల మాటేమిటని అనుకుంటున్నారా.. ముఖ్యంగా తండాల్లో, కాలనీల్లో ఇప్పటికీ అంతర్గత రహదారులు కనీస మరమ్మతుకు నోచుకోవడం లేదు. వర్షాకాలంలో ఈ రోడ్లగుండా ప్రయాణించాలంటే ఇబ్బందులు పడాల్సిందే. ఇలాంటి పరిస్థితుల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో అంతర్గత రోడ్లు వేసేందుకు ప్రభుత్వం అంగీకారం తెలపడంతో మండలానికి రూ.3.21 కోట్ల నిధులు మంజూరయ్యాయి. బంధంరేగడి, బొందిడి, బోరిగాం, బుద్ధికొండ, చిన్నబుగ్గారం, దర్బతండా, ఇస్పూర్ మధురతండా, సక్రియనాయక్‌తండా, కిష్టాపూర్, కొర్టికల్(బి), కుంటాల(కె), కుమారి, కొర్టికల్(కె), లింగట్ల, నారాయణపూర్, సవర్గాం, రాజుర, వాంకిడి, వాగ్దారి, వడూర్, వెంకటాపూర్, తేజాపూర్, తర్నం, నేరడిగొండ, మాధాపూర్, నాగమల్యాల్ గ్రామాల్లో 50 పనులకుగాను 12 పనులు జరుగుతున్నాయి. ఈ నిధులతో ఆయా గ్రామాల్లో పనులు ముమ్మరంగా చేపట్టాలని అధికారులు ఆదేశించారు. అయితే మండలంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తోపాటు కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి వారి అనుచరులకు పనులను అప్పజెప్పడంతో నాణ్యత ప్రమాణాలతో పనులు నడుస్తాయా.. లేదోనన్న చర్చ సాగుతోంది. ఏదేమైనా అభివృద్ధి పనుల్లో ప్రజలకు ఉపయోగపడేలా పనులు చేస్తే ఆయా నాయకులకు గుర్తింపు వచ్చే అవకాశం ఉంటుందని మండలప్రజలు అభిప్రాయపడుతున్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి



ఉపాధిహామీ నిధుల ద్వారా చేపడుతున్న పనులు నాణ్యతతో చేపట్టాలి. అప్పుడే గ్రామాల్లో వేసిన సీసీ రోడ్లు ప్రజలకు ఉపయోగకరంగా ఉంటాయి. నాసిరకంగా చేపడితే మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోతాయి. దీంతో మళ్లీ ప్రజలకు రవాణా కష్టాలు తప్పవు. అధికారుల పర్యవేక్షణలో పనులు జరిగేలా చూడాలి.

– సోనయ్య హీరాసింగ్, బీజేపీ మండల కన్వీనర్

నెలాఖరులోగా పనులు పూర్తి



ఈనెల 31లోగా పనులు పూర్తిచేయాలి. ఆయా గ్రామాల్లో ఇప్పటికే పనులు ప్రారంభించాం. గడువులోగా పనులు పూర్తికాకుంటే నిధులు వెనక్కి వెళ్లిపోతాయి. ఈవిషయాన్ని దృష్టిలో ఉంచుకొని మాల్లో పనులు త్వరగా పూర్తిచేయాలి. నాణ్యత ప్రమాణాలు పాటించకుంటే బిల్లులు మంజూరు చేయడం జరగదు.

– అభినవ్, పీఆర్ ఏఈ, నేరడిగొండ

నేరడిగొండ మండలంలో..

మండలానికి కేటాయించిన మొత్తం పనులు:	50
పురోగతిలో ఉన్నవి :	12
ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు :	రూ.3.21 కోట్లు

మార్చి 31లోగా పూర్తి కావాల్సిందే..

ఉపాధిహామీ నిధులతో చేపడుతున్న ఈ పనులు మార్చి 31లోగా పూర్తి చేయాల్సి ఉండడంతో ఆయా గ్రామాల్లో పనులు చేపట్టేందుకు పలువురు ఆసక్తి కనబరుస్తున్నారు. గడువులోగా పనులు పూర్తి చేయాల్సి ఉండడంతో ఆ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పనులు సంబంధిత అధికారుల పర్యవేక్షణ జరిగితేనే నాణ్యతగా చేసే అవకాశాలు ఉన్నాయని చెప్పుకుంటున్నారు.

సంక్షిప్తంగా

హీరాసుక జయంతిని విజయవంతం చేయండి

నార్నూర్: ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఈనెల 26న నిర్వహిస్తున్న హీరాసుక జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జయంతి కార్య నిర్వహణ కమిటీ అధ్యక్షుడు దుర్వా నగేశ్, శంకర్ మహారాజ్ కోరారు. మంగళవారం గాదిగూడ మండలంలోని ఝరి గ్రామంలో శ్రీ గెడెం శంకర్ మహారాజ్ మఠంలో ప్రధాన్ సమాజ్ పెద్దలు నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రధాన్ సమాజ పెద్దలు, మేధావులు, ఆడపడుచులు, పిల్లలు తరలిరావాలని కోరారు.

ఘనంగా శబరిమాత విగ్రహ ఆవిష్కరణ

బోథ్: మండలంలోని కుచులాపూర్‌లో శబరిమాత విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామపుర వీధుల గుండా భక్తులు శోభాయాత్ర చేపట్టారు. అనంతరం విగ్రహాన్ని ఆవిష్కరించారు.

24 నుంచి వాలీబాల్ పోటీలు

బోథ్: మండలంలో పట్నాపూర్ గ్రామంలో చైతన్య యూత్ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు యూత్ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీ ఎంపీ నగేష్, బీజేపీ నాయకులు సాకటి దశరథ్, మాజీ ఎమ్మెల్యే బాపూరావ్‌లకు ప్రారంభోత్సవానికి ఆహ్వానం అందించినట్లు పేర్కొన్నారు. 23లోగా పాల్గొనే జట్టు పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9381742229, 9603341339 సెల్‌నంబర్‌లో సంప్రదించాలన్నారు.

సంకల్పయాత్రకు ఏర్పాట్లు

ఇచ్చోడ: మండల కేంద్రంలో బుధవారం నిర్వహించే బీజేపీ సంకల్పయాత్రకు నాయకులు ఏర్పాట్లు చేశారు. నిర్మల్ బైపాస్ నుంచి ఆదిలాబాద్ బైపాస్ వరకు రోడ్డుకు ఇరువైపులా పార్టీ జెండాలను కట్టారు. మధ్యాహ్నం నిర్వహించనున్న ఈ రోడ్‌షోలో అంబేద్కర్ చౌరస్తా వద్ద జాతీయ కార్యదర్శి బండి సంజయ్ హాజరవుతారని నాయకులు తెలిపారు.

సాముహిక హనుమాన్ చాలీసా పారాయణం

ఇచ్చోడ: మండల కేంద్రంలో బుధవారం టీచర్స్ కాలనీలో సాముహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. సనాతన దర్మ సేవా సమితీ హన్మన్ శక్తి జాగృత్ ఆధ్వర్యంలో గత కొన్ని రోజుల నుంచి మండల కేంద్రంలో పలు కాలనీలో హన్మన్‌చాలీసా పఠనం జరుగుతుంది. ప్రతీ రోజు ఐదు ఇళ్లలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అడేగామ(బి), ఇచ్చోడ మండల కేంద్రానికి చెందిన రెండు బృందాలు ఈ కార్యక్రమాన్ని స్వచ్ఛందంగా నిర్వహిస్తున్నాయి. వైష్ణవసదన్ పీఠాధిపతి నారయణ మహరాజ్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

గోండ్వాన ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేయూత

ఉట్నూర్‌రూరల్: మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలం జిల్లెడ గ్రామానికి చెందిన పీగం అనూష నిరుపేద విద్యార్థినికి మిల్కీ, గోండ్వానా ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేయూత నందించారు. విరాళాలు సేకరించి వచ్చిన రూ.19,500 ఆర్థికసాయాన్ని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా చేతుల మీదుగా విద్యార్థిని తల్లికి అందించారు. ఫౌండేషన్ చైర్మన్ సిడాం తిరుపతి, గౌరవ అధ్యక్షుడు రాజ్‌కుమార్ ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఇంద్రవెల్లి: తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ మంగళవారం ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు విష్ణు, మండల అధ్యక్షుడు పెందోర్ కృష్ణ, నాయకులు గణేశ్ ఉన్నారు.

ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ఆలయ 9వ వార్షికోత్సవంలో భాగంగా తొలిరోజు యాగశాల ప్రవేశం, అర్చన, హోమం ధ్వజారోహణం నిర్వహించారు. చివరి రోజు గురువారం స్వామి కల్యాణం, రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా ఉర్సు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని చాందా (టి) సమీపంలో గల అజరత్ సైయ్యద్ షిరజొద్దీన్ (రాజషా) దర్గా వద్ద మంగళవారం రాత్రి ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పట్టణంతోపాటు చుట్టుపక్కల భక్తులు చాదర్‌లు సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు. ఇదిలా ఉండగా రాత్రి ఉత్తరప్రదేశ్‌కు చెందిన జునేద్‌సుల్తానీ నిర్వహించిన కవాలి ఆకట్టుకుంది.

‘కాంగ్రెస్‌తోనే అభివృద్ధి’



మాట్లాడుతున్న ఆడే గజేందర్

నేరడిగొండ: నియోజకవర్గ అభివృద్ధికి ఇక ఆటంకాల్లేవని, రాష్ట్రంలో అధికారంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో బోథ్, సిరికొండ మండలాలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. లంబాడా, గిరిజనులు అనే భేదం లేకుండా పార్టీ ఆదేశాల మేరకు వారి కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి ఎంపీ టికెట్ ఆశావాహులు ఆత్రం సుగుణక్క హాజరు కావడంతో ఆమెను శాలువాతో సత్కరించారు. బోథ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రఫుల్‌చందర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ ఆడే వసంత్‌రావు, సిరికొండ మండల కన్వీనర్ షేక్ ఇమామ్, బోథ్ మండల కన్వీనర్ మహేందర్, నాయకులు బద్దం పోతారెడ్డి, అనుపట్ల సంజీవ్ కుమార్, వకీల్ పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న డీఆర్డీవో సాయన్న

జైనథ్: ఉపాధి హామీ పనుల్లో సిబ్బంది అవకతవకలకు పాల్పడినట్లు తేలితే కఠిన చర్యలు తప్పవని డీఆర్డీవో సాయన్న అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉపాధి హామీ ప్రజావేదిక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ వారీగా ఆడిట్ నివేదికలు పరిశీలించారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో అన్ని పంచాయతీల్లో రూ.2.01 కోట్ల పనులు చేపట్టగా, వాటికి సంబంధించిన ఆడిట్ రిపోర్టులను బృందం సభ్యులు చదివి వినిపించారు. ఈ సందర్భంగా డీఆర్డీవో మాట్లాడుతూ కొన్ని గ్రామాల్లో పనులు చేయనప్పటికి కూడా డబ్బులు చెల్లించినట్లు తెలిసిందని అన్నారు. త్వరలో పంచాయతీల వారీగా లెక్కలు తేల్చి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీవో కుటుంబరావ్, ఏపీడీ కృష్ణారావ్, ఎస్‌ఆర్పీలు నరేందర్, ఎంపీడీవో రవీంద్రనాథ్, ఈజీఎస్ ఏపీవో వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఏఫ్‌ఏలు తదితరులు పాల్గొన్నారు.

‘అధిష్టానం ఆదేశిస్తే పోటీలో ఉంటా’



మాట్లాడుతున్న ఆత్రం భాస్కర్

తలమడుగు: కాంగ్రెస్ తరఫున ఆదిలాబాద్ ఎంపీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నానని, అధిష్టానం ఆదేశిస్తే పోటీ చేస్తానని ఐటీడీఏ ఏపీవో ఆత్రం భాస్కర్ అన్నారు. మండలంలోని దేవాపూర్, బరంపూర్, పున్నగూడ, రత్నాపూర్, తదితర గ్రామాల్లో మంగళవారం పార్టీ కార్యకర్తలతో కలిసి సమావేశం నిర్వహించారు. అనంతరం పార్టీ టికెట్ కేటాయిస్తే భారీ మెజార్టీతో గెలిచి ఆదిలాబాద్ జిల్లాను అన్నిరంగాలో అభివృద్ధి చేస్తానని తెలిపారు. జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి, ఎంపీపీ కళ్యాణం లక్ష్మి రాజేశ్వర్, మాజీ జెడ్పీటీసీ బాబన్న, ప్రకాశ్‌రావు, రత్నపూర్ మాజీ సర్పంచ్ రాంబాయి, మండల ఉపాధ్యక్షురాలు పెందూర్ దివ్య మాధవ్ పాల్గొన్నారు.

ఎంపీ టికెట్ ఇస్తే పోటీచేస్తా

బోథ్: కాంగ్రెస్ తరఫున ఆదిలాబాద్ ఎంపీ టికెట్ కేటాయిస్తే గెలిచి చూపిస్తానని ఆశావాహురాలు ఆత్రం సుగుణ అన్నారు. మంగళవారం సొనాల గ్రామానికి వచ్చిన ఆమెను కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. అనిల్, గుడాల శేఖర్, గాజుల పోతన్న, బత్తుల రమేశ్, విజయ్‌భాస్కర్, పోతన్న, పోశెట్టి, సుధాకర్, మహేశ్, గుడాల అనీష్, అమృత్ రావ్, శేకర్, సంగపాల్ ఉన్నారు.

అనుమతులు లేకుండానే పనులు

- ‘మామూలు’గా తీసుకుంటున్న అధికారులు



మెటీరియల్ డంప్ చేసిన దృశ్యం

నేరడిగొండ: మండలంలోని వడూర్ సమీపంలో గల దర్గా ఇనామ్ భూమిలో ఓ కాంట్రాక్ట్ సంస్థ వారు డాంబర్ ప్లాంట్ తయారీకి యంత్రాలు సిద్ధం చేశారు. మెటీరియల్‌ను సైతం డంప్ చేశారు. అయితే సంబంధిత కాంట్రాక్టర్ ఎలాంటి అనుమతులు లేకుండానే పనులు కానిచ్చేస్తున్నారన్న విమర్శలున్నాయి. రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు ‘మామూలు’గా తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా, ఈ గ్రామంలో దర్గా ఇనామ్, లావణి పట్టా భూములు ఉన్నాయి. ఇందులో ప్లాంట్ ఏర్పాటుతో చుట్టుపక్కల పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు పేర్కొంటున్నారు. బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యేతో పాటు అధికార పార్టీకి చెందిన నాయకులు, పోలీసులు మావారే ఉన్నారంటూ సదరు సంస్థ కాంట్రాక్టర్ చెప్పుకోవడం గమనార్హం. ఈ విషయమై తహసీల్దార్ సంతోష్ రెడ్డిని వివరణ కోరగా ఎలాంటి అనుమతులు లేవని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని వివరించారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

నార్నూర్: రాష్ట్రప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. మంగళవారం నార్నూర్, గాదిగూడ మండలాల్లో ఆమె పర్యటించారు. గాదిగూడలో 28, నార్నూర్‌లో 51 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం కింద రూ, 1,00,116 నగదుతోపాటు తులం బంగారం ఇస్తామన్న హామీని నెరవేర్చాలన్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేసి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఎంపీపీ మోతుబాయి, ఎంపీడీవో జవహర్, తహసీల్దార్ జాడి రాజలింగు, డిప్యూటీ తహసీల్దార్ అమత్‌లాల్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగోరావ్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఊర్వేత రూప్ దేవ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష కార్యదర్శులు మేస్త్రం హనుమంత రావు, సయ్యద్ ఖాసిం, ఆటో యూనియన్ అధ్యక్షుడు ఫిరోజ్‌ఖాన్, ఎంఐఎం మండల అధ్యక్షుడు బాబాఖాన్, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా నాయకుడు లోకండే చంద్రశేఖర్, ఏజెన్సీ గిరిజనేతరుల సంఘం మండల అధ్యక్షుడు షేక్ దాదేఅలీ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషిచేయాలి



ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాలో కాంగ్రెస్ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పేర్కొన్నారు. పట్టణానికి వచ్చిన ఆయన ముందుగా మావలలోని రాష్ట్ర కిసాన్ సెల్ ప్రధాన కార్యదర్శి బొరంచు శ్రీకాంత్‌రెడ్డి నివాసంలో మంగళవారం కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. జిల్లాను ముందుండి నడిపించే రథసారథికి, అన్ని అర్హతలు ఉన్న వ్యక్తిని డీసీసీ అధ్యక్షుడిగా నియమించాలని కార్యకర్తలు ఎమ్మెల్యేను కోరారు. కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డికి అధ్యక్ష పదవి ఇవ్వాలని పలువురు కార్యకర్తలు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పార్టీ బలోపేతానికి జిల్లా అధ్యక్షులను నియమించే అవకాశాలు ఉన్నాయన్నారు. శ్రీకాంత్ రెడ్డిని డీసీసీ అధ్యక్షుడిగా నియమించేలా కృషి చేస్తానన్నారు. సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్, మావల వైస్ ఎంపీపీ గోవర్ధన్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాయి చరణ్‌గౌడ్, అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ రావు, మావల మండల అధ్యక్షుడు శేఖర్, ఎన్ఎస్‌యూఐ మావల మండల అధ్యక్షుడు గౌతమ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సదస్సును విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్గనైజేషన్ కమిటీ నాయకులు

ఎదులాపురం: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 25, 26 తేదీల్లో నిర్వహిస్తున్న అఖిల భారత విద్యార్థుల సదస్సును విజయవంతం చేయాలని ఆర్గనైజేషన్ కమిటీ జిల్లా బాధ్యుడు ఆజాద్ కోరారు. జిల్లా కేంద్రంలోని మంగళవారం సదస్సు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ విద్యావిధానం 2020ను రద్దు చేయాలని, ఉమ్మడి శాస్త్ర విద్యావిధానం అమలు చేయాలని, విశ్వవిద్యాలయాల్లో ఉన్న బోధన, బోధననేతర ఖాళీలు భర్తీ చేయాలన్నారు. విద్యార్థి సంఘాల జేఏసీ కన్వీనర్ రాహుల్, నాయకులు శ్రవణ్, గణేశ్, విక్రం, నవీన్ కుమార్, సుజయ్, సత్యనారాయణ, సాయికుమార్, ఇఫ్తార్‌ఖాన్, అశోక్ పాల్గొన్నారు.

యువత క్రీడాస్ఫూర్తి చాటాలి



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే

నేరడిగొండ: గ్రామీణ ప్రాంత యువత క్రీడా స్ఫూర్తి చాటాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బోరిగాంలో యువకుల ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విజేత జట్టుకు ట్రోఫీని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలతో శారీరంగా దృఢంగా ఉంటారని తెలిపారు. అంతకు ముందు సేవాలాల్ మహరాజ్ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యేను సన్మానించారు. బీఆర్‌ఎస్ నాయకులు సాబ్లే నానక్ సింగ్, దేవేందర్‌రెడ్డి, జాదవ్ పవన్ నాయక్, గులాబ్‌సింగ్ పాల్గొన్నారు.

బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గంగయ్య



బొడ్డు గంగయ్య



ఆడె వసంత్ రావ్

బోథ్: బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బొడ్డు గంగయ్య, వైస్ చైర్మన్‌గా ఆడె వసంత్ రావ్‌ను నియామకమయ్యారు. వీరితోపాటు 16 మందిని సభ్యులుగా నియమితులయ్యారు. సభ్యులుగా మహమ్మద్ ఇబ్రార్, యాల్ల ఇంద్రారెడ్డి, జాదవ్ రుప్లా, పాలెపు పోశెట్టి, జుంగాల పోతన్న, అర్క యాదవ్ రావ్, పోరెడ్డి నారాయణ, ఉట్నూర్ నారాయణగౌడ్, నల్ల సవిత, రాయిసిడాం ఇస్రు, కత్తూరి విశ్వనాథ్, కత్తూరి మల్లేశ్‌తోపాటు నేరడిగొండ మండలంలోని కూమారి పీఏసీఎస్ చైర్మన్, జిల్లా మార్కెటింగ్ అధికారి, బోథ్ డివిజన్ ఏడిఏ, బోథ్ సర్పంచ్ లేదా ప్రత్యేకాధికారి ఉన్నారు. వీరి పదవీకాలం రెండేళ్లపాటు కొనసాగనుంది.

ఘనంగా సప్తాహ ముగింపు వేడుకలు

జైనథ్: మండలంలోని సాంగ్వి గ్రామంలో బాజీరావ్ బాబాసప్తాహ ముగింపు వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. బాబా ఆలయంలో భక్తులు పూజలు, గీతాపారాయణం, హరిపాట్ గావించారు. అనంతరం బాబా చిత్రపటాన్ని బంతిపూలతో అలంకరించిన పల్లకిలో ప్రతిష్ఠించి గ్రామప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అడుగడుగున పల్లకికి ప్రత్యేక పూజలు చేశారు. దేవత వేషధారణలో ఉన్న చిన్నారులను రథంపై కూర్చోబెట్టి పల్లకి వెంట నడిపించారు. మహిళలు మంగళహారతులతో ముందుకుసాగగా, భక్తులు భజనలు, కీర్తన చేపట్టారు. నృత్యాలు, కోలాటాలతో యువకులు శోభాయాత్రలో పాల్గొన్నారు.

అడిగిన ప్రతిఒక్కరికీ పని కల్పించాలి

నేరడిగొండ: అడిగిన ప్రతిఒక్కరికీ ఉపాధిహామీ పథకం కింద పని కల్పించాలని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. మండల కేంద్రంలో ఉపాధిహామీ పనులను మంగళవారం పరిశీలించారు. కూలీల ద్వారా పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిఒక్కరికి పనులు కల్పిస్తామన్నారు. అలాగే వ్యవసాయానికి సంబంధించిన పనులు ఉంటే ముందస్తు సమాచారం అందించాలన్నారు. ఈజీఎస్ ఏపీవో వసంత్‌రావు, పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర, టీఏ వినోద్, ఎఫ్ఏ లత తదితరులు ఉన్నారు.